క్లుప్తంగా

ఉత్సవాలకు శుభరాట



ఉత్సవాలకు శుభరాట వేస్తున్న దృశ్యం

మందస: మేజరు పంచాయతీ మందస గ్రామ దేవత అన్నపూర్ణమ్మ తల్లి ఉత్సవాలకు నిర్వహణ కమిటీ, గ్రామ పెద్దలు, మహిళల ఆధ్వర్యంలో దేవరవీధిలో శుక్రవారం శుభరాట వేశారు. రాజుల కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ ప్రకారం భక్తిశ్రద్ధలతో కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలు ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలియజేశారు.

తక్షణ సాయం అందజేత

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన బొమ్మాళి ఎండయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో అతని కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేల నగదును సర్పంచ్ పి.బృందాదేవి చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పి.రవికుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యు.ఉమాపతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రైతుల సమస్యలు పరిష్కరించండి'

మందస: మండలంలో అపరిష్కృతంగా ఉన్న రైతుల సమస్యలను పరిష్కరించాలని మహేంద్ర రైతు సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు కోరారు. మందసలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాజుల హయాం నుంచి ఈ ప్రాంతంలో సాగునీటి వనరులున్నప్పటికీ, అవి పూర్తిస్థాయిలో సద్వినియోగం కాలేదన్నారు. గోపాలసాగరం, సంకుజోడు, జంతిబంద, జెన్నా చెరువులను మినీ రిజర్వాయర్లుగా మార్చితే రైతులకు మేలు జరుగుతుందన్నారు. జీడికి రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

కంచిలి: మండలంలోని చిన్నశ్రీరాంపురం గ్రామానికి చెందిన కేన్సర్ బాధిత చిన్నారి లండ యోగేంద్రకు పద్మతుల గ్రామానికి చెందిన గుజ్జు కేశవరావు(కువైట్) హరే రామ హరే కృష్ణ టీమ్ ఆర్థిక సాయం చేశారు. చిన్నారి కుటుంబ సభ్యులకు రూ.8 వేలను శుక్రవారం అందించారు. కార్యక్రమంలో గుజ్జు త్రినాథ్, ఆబోతు కూర్మారావు, గుమ్మడి సంతోష్, జగన్, తెలుకుల బృందావన్, భగవాన్, రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ మన ప్రభుత్వం నేడు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూడి జగన్నాథపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సాయంత్రం 3 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొంటారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరామర్శ

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన పాశాల శంకరరావు(70), చంద్రుపుట్టుగ గ్రామానికి చెందిన చెత్త మణమ్మ(51)లు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయనతో పాటు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, సర్పంచ్‌లు పొందల ఢిల్లీరావు, గొనప సీతారాం తదితరులున్నారు.

జీడి రైతుల సదస్సు రేపు

పలాస: మండలంలోని నీలావతి గ్రామంలో ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ప్రాంగణమైనటువంటి ప్రజా గ్రంథాలయంలో ఆదివారం ఉదయం 7 గంటలకు మండలంలోని 5 పంచాయతీలకు చెందిన జీడి రైతులతో సదస్సు నిర్వహించనున్నట్లు జీడి పిక్కల గిట్టుబాటు ధర పోరాట కమిటీ కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సదస్సు అనంతరం మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు వినతి పత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరవ్వాలని కోరారు.

'రైతులకు అందుబాటులో ఉండాలి'

టెక్కలి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వ్యవసాయాధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.వైకుంఠరావు సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు సకాలంలో అందే విధంగా చూడాలన్నారు. అలాగే రైతు భరోసాకు వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేయాలన్నారు. మండలంలో మొత్తం 17 సీహెచ్‌సీ గ్రూపులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో వ్యవసాయాధికారి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లేని ప్రాంతాలుగా గిరిజన గ్రామాలు



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సీదిరి అప్పలరాజు

- మంత్రి సీదిరి అప్పలరాజు
- చీపిలో గడప గడపకూ మన ప్రభుత్వం

మందస: గిరిజన ప్రాంతాల్లో సమస్యల్లేకుండా చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని గిరిజన ప్రాంతమైన చీపి పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. గతంతో పోల్చితే ప్రస్తుతం గిరిజన పల్లెలు సుందరంగా మారాయన్నారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఉన్న ఈ పంచాయతీలో జగనన్న కాలనీలతో రూపురేఖలు మారుతున్నాయని పేర్కొన్నారు. ప్రతీ గిరిజన పల్లెకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలియజేశారు. పంచాయతీ పరిధిలో కొన్ని సమస్యలున్నాయని, త్వరలో పరిష్కరిస్తామని వెల్లడించారు. పోడు వ్యవసాయం చేసుకునే గిరిజనులకు ఆర్‌ఓఆర్ పట్టాలు అందజేస్తామని, మిగులు భూములను గుర్తిస్తే గిరిజనులకు పట్టాలు పంపిణీ చేస్తామని తెలియజేశారు. దాళసరి జలపాతాలను రూ.కోట్ల వ్యయంతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా బోయ, వాల్మీకి కులాలను గిరిజనుల్లో చేర్చడం సరికాదని కొంతమంది గిరిజనులు మంత్రి సీదిరి దృష్టికి తీసుకువచ్చారు.

సర్పంచ్ సవర లక్ష్మీప్రియ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్‌లు సవర నమిత, సుధాకర్, సచివాలయాల కన్వీనర్ చింతాడ గణపతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శానాపతి కిషోర్‌కుమార్, యర్రగుంట్ల కృష్ణమోహన్, సవర బాలకృష్ణ, నీలకంఠం, దల్లి జానకిరావురెడ్డి, తమిరి శోభన్‌బాబు, ఎంపీటీసీ సవర కాంచన, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, హౌసింగ్ ఏఈ గార రామ్మోహనరావు, ఏఈలు కణితి కృష్ణారావు, ప్రసన్నకుమార్, ఏపీవో బి.వి.హరికృష్ణ, ఏపీఎం జి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వడ్డివాడ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, నిష్పక్షపాతంగా పథకాలు అందజేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, సర్పంచ్ కోత ఇందిర, ఎంపీటీసీ కోత శ్రీకన్య, మేరుగు అప్పారావు, నక్క భీమారావు, పొందల రామకృష్ణ, కోత సతీష్, మండల జేసీఎస్ కన్వీనర్ మోడీ భాస్కరరెడ్డి, ఎన్ని మన్మథరావు, హన్నురావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- సోంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

సోంపేట: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. పట్టణంలోని సచివాలయం-2 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలియజేశారు. ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరిందనే నమ్మకంతోనే గడప గడపకూ వెళ్తున్నామని పేర్కొన్నారు. అనంతరం స్థానికుల సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ నగిరి ప్రభావతి, ఉప సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ పొడుగు కామేష్, పార్టీ నాయకులు తోట ఢిల్లీరావు, బీన ఢిల్లీరావు, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న సాయిరాజ్

సోంపేట: మండలంలోని బారువ గ్రామంలో సాగునీటిని సరఫరా చేసే గ్రోయిన్ మరమ్మతులకు నిధులు కేటాయించాలని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బారువ గ్రోయిన్ పూర్తిస్థాయి మరమ్మతులకు సమయం లేనందున, ప్రస్తుతం తాత్కాలిక పనులు చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలన్నారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు సాయిరాజ్ తెలిపారు. అలాగే బహుదా నదిపై బైపాస్ రహదారి నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేశారని, వాటితో పాటు శాశ్వత బ్రిడ్జి నిర్మాణానికి రూ.20 కోట్ల నిధులు విడుదలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

ఇచ్ఛాపురం: అంగన్‌వాడీల సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్ (ఆర్‌జేడీ) జి.చిన్మయిదేవి సూచించారు. స్థానిక అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీల సీడీపీవో, సూపర్‌వైజర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ఫలితాలు అందేలా చూడాలన్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

రైతులపై ఒత్తిడి చేస్తే సహించేది లేదు



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు
- కళింగ కార్పొరేషన్ చైర్మన్ తిలక్, ఎంపీపీ శ్రీరామ్మూర్తి
- సజావుగా మండల సర్వసభ్య సమావేశం

టెక్కలి: ఇటీవల నందిగాం మండలం పెద్దలవునిపల్లి గ్రామ సచివాలయం పరిధిలో ఇన్సూరెన్స్ అవకతవకలు చోటు చేసుకున్నాయని, అయితే రికవరీ విషయంలో బాధ్యులను వదిలేసి రైతులపై ఒత్తిడి చేస్తే సహించేది లేదని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ స్పష్టం చేశారు. నందిగాం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గృహ నిర్మాణదారులకు వేగవంతంగా పెండింగ్ బిల్లులు చెల్లించాలని సూచించారు. ఎంపీపీ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ వేసవిలో కొండల ప్రాంతంతో పాటు ఇతర గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యుత్ సమస్యలు, మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం కర్లపూడి సర్పంచ్ తమిరె రాజు మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలకు అందజేసిన స్ప్రింక్లర్లను ఎందుకు మరలా తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. కల్లాడ సచివాలయం పరిధిలో సచివాలయం లైన్‌మెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్పంచ్ మడపాల తిరుపతిరావు వాపోయారు. జమ్మిపేటలో గత 15 రోజులుగా విద్యుత్ లేదని, దీనిపై లైన్‌మెన్‌కు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. దిమిడిజోలలో ఏఎన్ఎం పోస్టును భర్తీ చేయాలని వైస్ ఎంపీపీ లక్ష్మీకాంతం కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కె.బాలకృష్ణ, ఎంపీడీవో హెచ్.రమణమూర్తి, వైస్ ఎంపీపీ-2 వి.వసంతకుమార్, ప్రత్యేక ఆహ్వానితుడు చిన్ని జోగారావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

మందస: ఐసీడీఎస్ మందస ప్రాజెక్టు పరిధిలో సోంపేట, మందస మండలాలకు సంబంధించి అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో కె.వసుంధరాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సోంపేట మండలంలోని మాకన్నపురం-1, జింకిభద్ర-1లలో అంగన్‌వాడీ వర్కర్లు, ఇసకలపాలేం-2, పలాసపురం-2లలో అంగన్‌వాడీ హెల్పర్లు, మందస మండలంలోని పిడిమందస, సింగుపురం, హరిపురం-4, నారాయణపురం గ్రామాల్లో అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 12 నుంచి 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను మందస పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీడీపీవో పురాణం నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కవిటి మండలం అంగన్‌వాడీ కార్యకర్తలకు సంబంధించి బసవకొత్తూరు (ఓసీ–ఈడబ్ల్యూఎస్), బల్లిపుట్టుగ-1(ఓసీ), కంచిలి మండలం జెన్నాగాయి(ఎస్టీ) పోస్టులకు రోస్టర్ పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా అంగన్‌వాడీ సహాయకురాల పోస్టులకు సంబంధించి కంచిలి మండలం అర్జునాపురం(ఎస్సీ), జె.బైరిపురం(బీసీ–సీ), ఇచ్ఛాపురం మండలం మండపల్లి-1(ఓసీ), కవిటి మండలం ఇద్దివానిపాలెం-1(ఓసీ), ఆర్.కరాపాడు(ఎస్సీ), ఇచ్ఛాపురం అర్బన్ పరిధిలో కార్జివీధి(బీసీ–సీ) పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు.

ఇంగ్లిష్‌పై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు క్లాసులు చెబుతున్న మోహన్

టెక్కలి రూరల్: స్కూల్ దశ నుంచే ప్రతి విద్యార్థీ ఇంగ్లిష్‌పై అవగాహన పెంపొందించుకోవాలని విశ్రాంత ఇంగ్లిష్ టీచర్ జి.మోహన్ సూచించారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. అదేవిధంగా విద్యార్థులకు 100 మీటర్ల రన్నింగ్ పోటీలు శనివారం నిర్వహించనున్నట్లు గ్రంథాలయ నిర్వాహకుడు ఎస్.ఉదయ్‌కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో అమ్మన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించేందుకు చర్యలు

- ఎంపీపీ నిమ్మన దాస్



మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

సోంపేట: ఖరీఫ్ సీజన్‌లో సక్రమంగా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బెందాళం వెంకటరమణ ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ.. జాబ్ కార్డుల కోసం వేతనదారులు ఎదురు చూస్తున్నారని, జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో ఉపాధి హామీ ద్వారా బిల్లులు అందడం లేదని ఫిర్యాదు చేశారు. దీనికి ఎంపీపీ స్పందించి ఉపాధి హామీ ద్వారా ఇళ్ల బిల్లులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సాగునీటి కాలువలు, గ్రోయిన్లు మరమ్మతులు చేసి, సకాలంలో నీరు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖాధికారులను కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు మాట్లాడుతూ.. బారువ జగనన్న కాలనీలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు అందించి ఉన్నారని, నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నూతనంగా కంచిలి ఏఎంసీ చైర్మన్‌గా ఎంపికైన సుంకిడి పంచాయతీకి చెందిన బతకల మోహన్‌రావును సత్కరించారు. సమావేశంలో జెడ్పీటీసీ తడక యశోద, వైస్ ఎంపీపీ గురాల శ్రీను, మాజీ ఎంపీపీ మంగి గణపతి, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, సర్పంచ్‌లు నగిరి ప్రభావతి, పాతిన శేషగిరి, పొందూరు గున్నయ్య, తామాడ పద్మావతి, బట్టి మాధవరావు, ఎంపీటీసీలు పొడుగు కామేష్, మద్దు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



కవిటి: గంగా ఆహ్వాన జలయాత్రలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు



కంచిలి: అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని కుసుంపురంలో ఈనెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిరంతరాయంగా నిర్వహించనున్న 72 గంటల హరేరామ హరేకృష్ణ(తారక నామ మంత్రం) యజ్ఞం నిర్వహణకు శుక్రవారం సాలసంస్కారం, గంగాజల ఆహ్వానం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామానికి చెందిన మహిళలతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ గంగాజల ఆహ్వాన శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ జలాలతో యాగశాల సంప్రోక్షణ కార్యక్రమం పురోహితులు నిర్వహించనున్నారు. శనివారం నుంచి శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిరాటంకంగా జరుగుతాయని నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కంచిలి: మండలంలోని తలతంపర గ్రామంలో కొలువైన సింధుపురాణి అమ్మవారిని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ దర్శించుకున్నారు. ఈ ఆలయం పునః ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఆమెతోపాటు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ జగబంధు దొళాయి, ఎంపీటీసీ సభ్యుడు బృందావన్‌సాహు తదితరులు ఉన్నారు.

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామంలో సంతోషిమాత ఉజ్జాపనలను మహిళలు సామూహికంగా శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా ఒకచోట చేరి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, స్థానిక నేతలు కప్పల యుగంధర్, బెల్లుపడ ఉపసర్పంచ్ దేశెట్టి దాలిబందు తదితరులు పాల్గొన్నారు.

సేవామూర్తులు నర్సులు



కేక్ కట్‌చేస్తున్న డాక్టర్ మేఘన తదితరులు

కాశీబుగ్గ: నిరుపేద ప్రజలకు సేవామూర్తులుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్నటువంటి నర్సులు నిలుస్తున్నారని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ అన్నారు. ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా సీహెచ్‌సీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి నర్సులు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అగ్గున మేఘన, హెడ్ నర్సు ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఆదివారం అంతరాయం కలుగుతుందని పలాస మండల విద్యుత్ ఏఈ భూషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజలంతా గమనించి, సహకరించాలని కోరారు.

16న సర్వసభ్య సమావేశం

కాశీబుగ్గ: ఈనెల 16వ తేదీన పలాస మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు పలాస మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.రమేష్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపీపీ ఉంగ ప్రవీణ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రత్యేక ఆహ్వానితులు, సభ్యులు హాజరవ్వాలని కోరారు.

హుద్‌హుద్ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలి

టెక్కలి: టెక్కలి రెవెన్యూ డివిజన్ పరిధిలో హుద్‌హుద్ ఇళ్ల కోసం తుఫాన్ బాధితులు దరఖాస్తులు చేసుకోవాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇళ్లు రాని వారు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు 90 రోజుల పథకం ద్వారా ఎటువంటి ఇంటి స్థలం మంజూరవ్వనివారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వారం రోజుల్లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బీఏ (హెచ్‌ఈపీ, హెచ్‌వోపీ, హెచ్‌పీటీ), బీకాం(జనరల్, సీసీఎస్, సీఏ), బీఎస్సీ (ఎంపీసీ, ఎంపీసీఎస్, సీబీజెడ్, బీహెచ్‌సీ, ఎంసీఏసీ) తదితర గ్రూపుల్లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 81869 03317 నంబరును సంప్రదించాలన్నారు.